క్లుప్తంగా

దోమలతో జాగ్రత్త



కాజూరు ప్రాంతంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. నగరంలోని కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడేను తనిఖీ చేశారు. వీధులను, ఇంటి పరిసరాలను పరిశీలించారు. దోమలు వృద్ధి కాకుండా చూడాలని స్థానికులకు సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటలకు నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ముగ్గురికి చోటు

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా నూతన కమిటీలో బంగారుపాళెం మండలానికి చెందిన ముగ్గురు నాయకులకు స్థానం కల్పించారు. మండలంలోని మహాసముద్రం గ్రామానికి చెందిన శరత్‌రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా, తగ్గువారిపల్లెకు చెందిన రఘుపతిరాజు, చీకూరుపల్లెకు చెందిన చెందురాయల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు.

జిల్లా కార్యదర్శిగా మనోహర్ రెడ్డి



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి

యాదమరి: జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా మాదిరెడ్డి పల్లెకు చెందిన మనోహర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, మండల నాయకులు ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తామని మనోహర్ రెడ్డి తెలిపారు.

మర్రి మొక్కకు చంద్రయాన్-3 నామకరణం



గంగవరం: చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పలమనేరు మున్సిపాలిటీ గంటావూరుకి సమీపంలో శుక్రువారం మర్రి మొక్కను నాటారు. ఆ మొక్కకు అందరూ చంద్రయాన్ 3గా నామకరణం చేశారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో నేతాజీ సిద్ధయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాణిపాకం: వరదరాజుల స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో భక్తులు



చిత్తూరు: వ్రతం చేస్తున్న మహిళలు



సద్గుణధాత్రి వరలక్ష్మీ నమోస్తుతే!

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం
- ఆలయాల్లో విశేష పూజలు
- పోటెత్తిన భక్తులు

చిత్తూరు రూరల్/ఐరాల: నమస్తేస్తు మహామాయే.. శ్రీ పీఠే సురపూజితే.. శంఖ చక్ర గధాహస్తే మహాలక్ష్మీ.. నమోస్తుతే! సద్గుణధాత్రి శీఘ్రఫలమియ్యవే.. సిరిసంపదల వరమహాలక్ష్మీ... నమోస్తుతే! అంటూ వేదపండితులు, భక్తులు వరలక్ష్మీ దేవిని కొలిచారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు తమ గృహాల్లో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటు చేసి ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. స్థానిక ఓం శక్తి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే పూజలు ప్రారంభం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక గిరింపేటలో వెలసిన దుర్గాంబ దేవస్థానంలో వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవలో మేల్కొలిపారు. మూలస్థానంలోని అమ్మవారికి నవధాన్యాలు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వ్రతాలు ఆచరించి పూజలు చేశారు.

గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారికి వ్రతపూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి ఇష్టమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. కర్పూర హారతి వెలుగులో అమ్మవారిని దర్శించుకున్నారు. పొన్నియమ్మ ఆలయం, దొడ్డిపల్లిలోని సప్తకనికలమ్మ ఆలయం, కొంగారెడ్డిపల్లిలోని కరుమారియమ్మ ఆలయం, మురకంబట్టులోని నాగాలమ్మ ఆలయం, పడవేటమ్మ ఆలయాల్లో వ్రత పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఉన్న పుట్టలో భక్తులు పాలు, గుడ్డు సమర్పించారు.

స్థానిక పొన్నియమ్మ ఆలయం ఉదయం నుంచే భక్తులతో రద్దీగా కనిపించింది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారిని గాజులు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు.





గుడిపాల: బొమ్మసముద్రం దుర్గాలమ్మ, చిత్తూరు : విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు





చిత్తూరు అంకాళపరమేశ్వరి అమ్మవారు, ఐరాల : కొలువుదీరిన వరమహాలక్ష్మి

శాస్త్రోక్తంగా వరలక్ష్మి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధ ఆలయం అయిన శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి విగ్రహంను వరలక్ష్మీ అవతారంలో అలంకరించి కొలువు తీర్చి వ్రతం ఆచరించారు.

పసుపు, కుంకుమ పంపిణీ

గుడిపాల: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గృహాల్లోనే మహాలక్ష్మి ప్రతి రూపాన్ని పసుపు, కుంకుమ కలశాలతో ఏర్పాటుచేసి ప్రత్యేక ఆభరణాలు వస్త్రాలతో అలంకరించారు. పిండివంటలు నైవేద్యంగా సమర్పించి వ్రతాన్ని ఆచరించారు. సాయంత్రం వేళ చుట్టుపక్కల ఉన్న మహిళలను ఇంటికి ఆహ్వానించి పసుపు, కుంకుమను బహూకరించారు. ముఖ్యంగా నరహరిపేట చెక్‌పోస్ట్ ఆవరణలో ఉన్న భద్రకాళమ్మ దేవాలయం, వసంతాపురంలో నాగాలమ్మ గుడి, బొమ్మసముద్రంలోని దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేకం హోమాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అన్నదానం చేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని ప్రతి గ్రామం వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. భక్తిప్రపత్తులతో మహిళలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఇళ్లలోనూ అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి మొక్కులు చెల్లించుకున్నారు.

బంగారుపాళెం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని మొగిలి శివాలయం, బంగారుపాళెంలోని ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, నలగాంపల్లెలోని శ్రీవేంకటేశ్వర స్వామి, మొగిలివారిపల్లెలోని పార్వతమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యమాలను నిర్వహించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేసిన కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కమిషనర్ అరుణ ఆర్థికసాయం అందజేశారు. తొలిసారిగా మృతి చెందిన కార్మికుల మట్టి ఖర్చుల కింద ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు శాశ్వత ఉద్యోగులకు మాత్రమే ఈ మొత్తాన్ని ఇస్తుండగా, తాజాగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సైతం దీన్ని వర్తింపచేశారు. ఇటీవల కాలంలో మృతి చెందిన రెడ్డెప్ప, రామ్మూర్తి, మురుగన్ కుటుంబీకులకు మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు ఉన్నారు.

గరుడవాహనంపై వరదరాజుల స్వామి



గరుడవాహనంపై విహరిస్తున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో స్వామివారు గరుడవాహనంపై విహరించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా స్వామివారు రాత్రి గరుడవాహనంపై కొలువుతీరి పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వాహన సేవకు శ్రీనివాస ఆచారి ఉభయదారులుగా వ్యవహరించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని వరదరాజుల పల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం ఆయన జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌లు అందించి వారికి వివరించారు. ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ కులమతాలు, పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. గ్రామీణ ప్రజలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యలను వివరించారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రానున్న ఎన్నికలలో మరోసారి జగనన్నను సీఎం చేస్తామంటూ సంతోషంగా చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, సర్పంచ్ పుష్పవతి, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, పరందామ గౌడ్, కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కరించాలి

గత వారం రోజులుగా మండల పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నింటినీ పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆదేశించారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగియగానే మండల స్థాయి అధికారులకు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరదరాజులపల్లె, యాదమరి సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు వెళ్లడంతో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారని గుర్తుచేశారు. వాటిని ఆయా సచివాలయ పరిధిలోని సిబ్బంది పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలను వలంటీర్లు గ్రామాల్లోని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంతగేటులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

జగన్ బాబు దేవుడు



చిన్నవాడైనా జగన్‌బాబు మాకు దేవుడితో సమానం అని సంతగేటులో వృద్ధురాలు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వద్ద జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి నమస్కరిస్తూ చెప్పారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సంతగేటు గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అవ్వా పింఛన్ వస్తోందా అని అడగ్గానే... అయ్యా జగన్‌బాబు చిన్నవాడైనా దేవుడయ్యా.. ఒకటో తేదీనే జీతం ఇచ్చినట్లు ఇంటివద్దనే పింఛన్ ఇస్తున్నారు. ఆ డబ్బుతోనే అన్ని సమస్యలు తీరుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి, మాలాంటి వృద్ధులను ఆదుకోవాలి.'' అని చెప్పారు.

ప్రతి ఇంటా సంక్షేమమే లక్ష్యం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఇంటా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక 48వ డివిజన్ సంతపేటలోని ఎల్లమ్మవీధిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంతపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సుబ్రమణ్యంను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతో ఆత్మీయంగా మాట్లాడి ధైర్యాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల వల్ల ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న వసతి దీవెన తదితర పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయని చెప్పారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. డివిజన్‌లోని మౌలిక వసతులు కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 48వ డివిజన్ ఇన్‌చార్జి నారాయణ, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ చల్లా ముత్తు, కో-ఆప్షన్ మెంబర్ కిరణ్, నాయకులు భూపేష్‌గోపినాథ్, కిషోర్, శేఖర్, కన్నన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇరువారంలో: స్థానిక 20వ డివిజన్ ఇరువారంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు పోతంబట్టు నాగాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

60 మందికి ఇంటి పట్టాల పంపిణీ



ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందజేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కిల్లారిపల్లె సమీపంలో 189కొత్తపల్లె పంచాయతీలో శుక్రవారం 60 మందికి ఇంటి పట్టాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇప్పటికే అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు ఇచ్చినట్లు వెల్లడించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారని చెప్పారు.

కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌పార్టీ నాయకులు రజినీకాంత్, శ్రీధర్‌రెడ్డి, డానియల్, ప్రసాద్‌రెడ్డి, శిలంబరసన్, గుండుసాయి, సాయి, సంపత్, వెంకటేశులురెడ్డి, మణి, లడ్డురెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

మండలంలోని కట్టకిందపల్లెలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను శుక్రవారం పంపిణీ చేశారు. కట్టకిందపల్లెలో యువత ఆధ్వర్యంలో 28 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో 190రామాపురానికి చెందిన జట్టు మొదటి విజేతగా నిలిచింది. విజేతకు రూ.10వేలు, రెండవ బహుమతి కట్టకిందపల్లె జట్టుకు రూ.7వేలు, మూడవ మహుమతి శ్రీరంగంపల్లెకు రూ.5 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

గ్రామాల్లో ఇంటి వద్దనే వైద్యసేవలు



తవణంపల్లె: ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్న వైద్య బృందం



గుడిపాల: వైద్యశిబిరంలో డాక్టర్ అనూష, సిబ్బంది



గుడిపాల ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందజేస్తున్న డాక్టర్ సందీప్ బృందం

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేయనున్నట్లు గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు అనూష, సందీప్ తెలిపారు. కిల్లారిపల్లె, రాసనపల్లె గ్రామంలో శుక్రవారం 104 వైద్య సేవలను అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. అనంతరం 114 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కిల్లారిపల్లె గ్రామంలో మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకన్నారు. అనంతరం అవసరమైన వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రోస్లిన్, సోనీ, ఇలవతి, బాబు, కిషోర్, అన్నపూర్ణ, శిరీష, భాస్కర్, మల్లిక పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని గోవిందరెడ్డి సచివాలయ పరిధిలోని కట్టకిందపల్లెలో శుక్రవారం వైద్య బృందం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మోహన్‌వేలు 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు ఆసుపత్రిలో ప్రసవించడం మంచిదని సూచించారు. అదే విధంగా రక్త హీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్టీ కాలనీలో పక్షవాతంతో బాధపడుతున్న సావిత్రమ్మ, సరోజమ్మ ఆరోగ్య స్థితి తెలుసుకుని వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నేత్రి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు జమున, వనజ, భారతి పాల్గొన్నారు.